క్లుప్తంగా

కెనాల్స్ లాకుల పరిశీలన



గుడ్లవల్లేరు: ఇటీవల విధుల్లో చేరిన ఇరిగేషన్ ఎస్ఈ గంగయ్య గుడ్లవల్లేరులోని క్యాంప్‌బెల్, బంటుమిల్లి, పోల్‌రాజ్ కెనాల్స్‌కు చెందిన లాకులను బుధవారం పరిశీలించారు. 10 మండలాలకు సరఫరా అయ్యే సాగునీటి విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఈఈ బాబు, డీఈ భరత్, ఏఈ రాజ్యలక్ష్మి, లాకు సూపరింటెండెంట్ ఎస్.దావీదు, సిబ్బంది ఉన్నారు.

రేపు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను శ్రావణ శుక్రవారం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆలయ ఈఓ కానూరి సురేష్ ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. మహిళా భక్తులు ఈ సామూహిక వ్రతాల్లో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేసి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

మసీద్ సొమ్ము దుర్వినియోగం కాలేదు



గుడివాడ టౌన్: స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న గుల్జార్ చౌక్ మసీద్‌కు చెందిన షాపుల లీజు వసూలు చేసిన సొమ్ము దుర్వినియోగం కాలేదని మసీద్ కమిటీ అధ్యక్షుడు షేక్ ఇబ్రహీం పేర్కొన్నారు. ఆయన నివాసంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఒక్కొక్క షాపు లీజుదారుని నుంచి రూ. 25 వేలు చొప్పున రెండు పర్యాయాలు వసూలు చేశామన్నారు. ఆ డబ్బును నూర్ మసీద్ నిర్మాణ పనులకు వినియోగించినట్లు తెలిపారు. తనవద్ద అందుకు సంబంధించిన పూర్తి ఆధారాలు ఉన్నాయని రానున్న శుక్రవారం వాటిని మసీదుకు సమర్పిస్తామన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కైకలూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శాంతి జ్యోతి బుధవారం తెలిపారు. ఒకేషనల్ సివిల్ ఇంజినీరింగ్ టెక్నాలజీ (సీఈటీ) పోస్టుకు అర్హులైన అభ్యర్థులు బీఈ, బీటెక్ సివిల్ ఇంజినీరింగ్‌లో మినిమం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని పేర్కొన్నారు. ఈ నెల 23 మధ్యాహ్నం మూడు గంటలలోపు దరఖాస్తులు అందించాలని తెలిపారు. 24న కాలేజీలో ఇంటర్వ్యూ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 94949 11486 సెల్ నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి ఐరన్‌ర్యాక్ బహూకరణ



ముదినేపల్లి రూరల్: మండలంలోని అల్లూరు-2 అంగన్‌వాడీ కేంద్రానికి దాత ఐరన్‌ర్యాక్‌ను బుధవారం బహూకరించారు. గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాసరావు కేంద్రంలోని చిన్నారులు పుస్తకాలు, కిట్లు పెట్టుకునేందుకు ఈ ఐరన్ ర్యాక్‌ను బహూకరించినట్లు తెలిపారు. కార్యకర్త సీహెచ్ నాగలక్ష్మీ, సూపర్‌వైజర్ సీహెచ్ ప్రసూన దాత శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

'పులపర్రు భూమిపై తీర్మానాలు జరగలేదు'



మండవల్లి: పులపర్రు గ్రామానికి చెందిన భూమిపై ఎలాటి తీర్మానాలు జరగలేదని డివిజనల్ పంచాయతీ అధికారి కె.పూర్ణచంద్రరావు అన్నారు. ఆ భూమి గ్రామస్తులదేనని తెలిపారు. ఈ విషయంపై బుధవారం ఆయన పులపర్రు సచివాలయం వద్ద పాలకవర్గంతో విచారణ చేపట్టారు. పులపర్రు గ్రామానికి చెందిన రీ సర్వే నంబర్ 110-1లో 1.25 ఎకరాలు, 111-1లో 1.59 ఎకరాల్లో భూమి ఇవ్వడానికి ఎక్కడా తీర్మానం జరగలేదని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి పీడీ శ్రీనివాస్ అక్రమార్కులతో కలిసి వారి వద్ద నుంచి ముడుపులు స్వీకరించి, పంచాయతీ రికార్డులలో నమోదు చేసినట్లు ఎక్కడా లేదన్నారు. సర్పంచ్ నాగరాజు, ఈఓపీఆర్డీ ఎ.ఆనందబాబు పాల్గొన్నారు.

బంద్ ప్రశాంతం



గుడివాడలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్సీ సంఘ నాయకులు

గుడివాడ టౌన్: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో నిర్వహించిన భారత్ బంద్ ప్రశాంతంగా జరిగింది. బంద్‌ను పురస్కరించుకుని ఎస్సీ సంఘాల నాయకులు తొలుత ర్యాలీ నిర్వహించారు. వ్యాపారులు, విద్యా సంస్థలు, కళాశాలల నిర్వాహకులు బంద్‌కు మద్దతుగా సెలవు ప్రకటించారు. హోటళ్లు, దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేసి వాటి యజమానులు మద్దతు తెలిపారు. వేకువ జామునే ఉద్యమ నాయకులు బస్టాండ్ వద్ద బైఠాయించి బస్సులు తిరుగకుండా నిలిపివేశారు. ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు, ఘర్షణలు జరుగకుండా బంద్ ప్రశాంతంగా ముగిసింది.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా గుడ్లవల్లేరులో బుధవారం బంద్‌ను విజయవంతంగా నిర్వహించారు. అఖిల భారత ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు దుకాణాలు, విద్యా సంస్థలు, కార్యాలయాలను మూయించారు. సమితి నాయకులు గుడే రవి, గురజ రాంబాబు, పెయ్యల సురేష్, కాకుళ్ల కోటేశ్వరరావు, దారం నిరంజనరావు, రాజు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పామర్రులో..

పామర్రు: పామర్రులో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సమితి ఆధ్వర్యంలో బుధవారం బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు మాట్లాడారు. ఈ బంద్‌కు మద్దతుగా ముందే ప్రైవేట్ విద్యాసంస్థలు, కళాశాలలు సెలవు ప్రకటించారని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంక్‌లు, ప్రభుత్వ పాఠశాలలను బంద్ సందర్భంగా మూయించినట్లు పేర్కొన్నారు. అన్నదమ్ములుగా ఉండే దళిత జాతిని విడదీసి దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి మోదీ మందా కృష్ణను వాడుకోవడం జరుగుతోందని పేర్కొన్నారు. బంద్‌కు సహకరించిన ప్రజలకు, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు నందిపు నాంచారయ్య, దాసరి భాను, దాసరి అశోక్‌కుమార్, నాగేంద్రరరావు, చిన్నం శ్రీనివాసరావు, పెయ్యల రాజు, తలారి మహేష్, కారుమంచి నాగ మల్లేశ్వరరావు, కురమా విజయ్‌కుమార్, మల్లేశ్వరరావు, కిరణ్ శివ, సబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్సీల మధ్య చిచ్చుకే వర్గీకరణ

మండవల్లి: మాల, మాదిగల మధ్య చిచ్చు పెట్టేలా ఎస్సీ వర్గీకరణ ఉందని, మాదిగలను ఓటు బ్యాంక్‌గా వాడుకునేందుకే ఈ కుట్ర అని బీఆర్ అంబేడ్కర్ అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చని ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ బుధవారం మండవల్లిలో బాబా సాహెబ్ విగ్రహం వద్ద నిరసన, బైక్ ర్యాలీ నిర్వహించారు. బీఆర్ అంబేడ్కర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, ఉపాధ్యక్షులు చాబత్తిన విజయ్, ఎల్ఎస్ భాస్కరరావు పాగొల్లు అబిశా, మెండా సురేష్, మాల మహాసేన జాతీయ కార్యదర్శి పళ్లెం ఏడుకొండలు, జై బీమ్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు ఒట్టిప్రోలు సుధీర్, మాల మహానాడు జిల్లా అధ్యక్షురాలు వెలగపల్లి బేబీసరోజిని, సీహెచ్ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం నిర్వహించిన బంద్ విజయవంతంగా ముగిసింది. రాష్ట్ర మాల మహానాడు, అనుబంధ సంఘాల అధ్యక్షుడు సేవా నాగ జగన్‌బాబురావు ఆధ్వర్యంలో పలు గ్రామాల నుంచి భారీ సంఖ్యలో వచ్చిన మాల మహానాడు నాయకులు ముదినేపల్లిలో నిర్వహించిన బంద్‌లో పాల్గొన్నారు. మాల మహానాడు అధ్యక్షుడు బాబురావు మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వెనుకకు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు పలుకుర్తి నాని, మేడపాటి తంబి, దరిశే విజయకుమార్, కారే ప్రశాంత్, పులి నరసింహారావు, కొప్పుల నాగరాజు, గుమ్మడి నాగబాబు, దగాని కోటేశ్వరరావు, కారే సుమంత్, బలే కుమార్, ఆకాష్ పాల్గొన్నారు.

కైకలూరులో..



కైకలూరులో బంద్ సందర్భంగా ర్యాలీగా వెళుతున్న ఎస్సీ నాయకులు

కైకలూరు: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును పునఃసమీక్షించాలని బుధవారం నిర్వహించిన భారత్ బంద్‌కు కైకలూరులో మిశ్రమ స్పందన కనిపించింది. దళిత నాయకులు పోస్టాఫీసు, పాఠశాలు, దుకాణాలు, బ్యాంకులను మూయించారు. అనంతరం జాతీయ రహదారిలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు వీరాబత్తిన సుధా, గడిదేశి విజయ్‌కుమార్, పళ్ళెం ఏడుకొండలు, గాలి ప్రసాద్, పళ్ళెం విజయబాబు, దళిత జేఏసీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.



పామర్రు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నాయకుల ఆందోళన



మండవల్లిలో నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో ఎస్సీ నాయకులు



కేడీసీసీ బ్యాంకును మూయిస్తున్న మాలమహానాడు నాయకులు

రైతులకు న్యాయబద్ధమైన ధర చెల్లిస్తాం

ఆర్‌డీఓ రాజు



వల్లూరుపాలెంలో రైతులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్‌డీఓ రాజు, తహసీల్దార్ కుసుమకుమారి

తోట్లవల్లూరు: లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు భూములిచ్చే రైతులకు న్యాయబద్ధమైన ధర చెల్లిస్తామని ఉయ్యూరు ఆర్‌డీఓ డి.రాజు తెలిపారు. మండలంలోని వల్లూరుపాలెంలో ఔటర్ రింగ్‌రోడ్డుకు అనుబంధంగా ఏర్పాటయ్యే లాజిస్టిక్ పార్క్ కోసం భూసేకరణకు సంబంధించి స్థానిక గ్రామ సచివాలయం వద్ద బుధవారం రైతులతో గ్రామసభ జరిగింది. లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు 80 ఎకరాల భూమి కావాల్సి ఉందని ఆర్‌డీఓ తెలిపారు. ఎకరానికి రూ.40 లక్షల ధర చెల్లిస్తామని చెప్పారు. కొంత మంది రైతులు ఎకరాకు రూ. కోటి ఇవ్వాలని డిమాండ్ చేయగా, మరికొంత మంది రూ.50 లక్షలైతే తమ భూములు ఇస్తామని చెప్పారు. రింగ్‌రోడ్డు ఏర్పాటుతో భూముల ధరలు పెరుగుతాయని, తక్కువ ధరకు భూములు అమ్ముకున్న తరువాత ఆ నష్టం తమకు ఎవరిస్తారని రైతులు అధికారులను ప్రశ్నించారు. రైతుల అభిప్రాయాలను సీఆర్‌డీఏ కమిషనర్‌కు పంపిస్తామని, తుది నిర్ణయం సీఆర్‌డీఏదేనని ఆర్‌డీఓ రాజు తెలిపారు. పేపర్ నోటిఫికేషన్ తరువాత ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే కోర్టుకు వెళ్లవచ్చని సూచించారు. తహసీల్దార్ కుసుమకుమారి, సర్పంచ్ కొనకాల రాజ్యలక్ష్మి, రీసర్వే డీటీ సత్యనారాయణ, మండల సర్వేయర్ సురేష్ పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు నిలయం సంస్కృతం



ర్యాలీ నిర్వహిస్తున్న చిన్నారులు

గుడివాడ టౌన్: సంస్కృతి, సంప్రదాయాలకు నిలయం సంస్కృతమని విజయవాడకు చెందిన సంస్కృత భారతి విశిష్ట అతిథి ఉపద్రష్ట వెంకట రమణమూర్తి అన్నారు. స్థానిక సత్యనారాయణపురంలోని ఉపద్రష్ట బ్రాహ్మణ సత్రంలో బుధవారం సంస్కృత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత సంస్కృత దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రామస్వామి శాస్త్రి మాట్లాడుతూ విదేశీ విధానాల పోకడతో యువత పూర్తిగా దారి తప్పుతోందన్నారు. విద్యార్థి దశ నుంచే సంస్కృతి, సంప్రదాయాలను వారికి నేర్పవలసిన అవసరం తల్లిదండ్రులపై ఉందన్నారు. అది ఒక సంస్కృత భాష అభ్యాసనం ద్వారానే సాధ్యపడుతుందన్నారు. సంస్కృతం దేశభాష, రాజభాష, అమృత భాష అని ఆయన అభివర్ణించారు. కార్యక్రమంలో గుడివాడ అధ్యక్షుడు ఉపద్రష్ట రామస్వామి శాస్త్రి, కార్యదర్శి పోపూరి శ్యామ్‌సుందర్, బాలకేంద్రం అధ్యక్షురాలు రమణశ్రీ, విశ్రాంత హెచ్ఎం జయమణి, నాయకులు కామినేని విజయ, ఎస్.సూర్యకుమారి, చింత లక్ష్మి, శివపార్వతి, అనసూయ, రేణుకాదేవి, వసంతలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ వృద్ధుల దినోత్సవం



పామర్రులో వృద్ధులను సన్మానిస్తున్న కళాపీఠం సభ్యులు

పామర్రు: జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని స్థానిక బందరు రోడ్డులోని వాసవీ వృద్ధ శరణాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాపీఠం అధ్యక్ష, కార్యదర్శులు కాటూరి వెంకటమురళీకృష్ణ, నందిపాటి హేమంత్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో నిరాదరణకు గురైతున్న వృద్ధులను ప్రతిఒక్కరూ సహృదయంతో ఆదరించాలన్నారు. నేటి సమాజంలో కొంతమంది తమ తల్లిదండ్రులను పట్టించుకోకపోవడంతో అనేక చోట్ల వృద్ధుల శరణాలయాలు వెలుస్తున్నాయన్నారు. ఇటువంటి సమాజానికి స్వస్తి పలికేవిధంగా నేటి యువత తమ తల్లిదండ్రులను ఆదరించాలని కోరారు. అనంతరం పలు రంగాల్లో నిష్ణాతులైన వృద్ధులు బొగ్గరపు జాలయ్య, తాళ్లూరి వెంకటేశ్వరరావు, పరిశ వెంకటరత్నం, సాల్మన్ కొల్లాబత్తుల, ఐవీఎస్ మనోహర్‌ను కళాపీఠం తరపున ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సభ్యులు బొగ్గరపు సాయిబాబు, పరిశ వెంకటనాంచారయ్య, ఘంటసాల భరతుడు, రాజబాబు పాల్గొన్నారు.

నూరు శాతం రికవరీ చేసిన సీఈఓలకు సన్మానం



పెదమద్దాలి, జమీగొల్వేపల్లి సీఈఓలను సన్మానిస్తున్న జేసీ గీతాంజలిశర్మ

పెదమద్దాలి(పామర్రు): పామర్రు మండలం పెదమద్దాలి, జమీగొల్వేపల్లి పీఏసీఎస్‌లలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో నూరుశాతం రుణాల రికవరీ సాధించినందుకు ఆయా పీఏసీఎస్‌ల సీఈఓలను బుధవారం సన్మానించారు. కేడీసీసీ బ్యాంక్ చైర్ పర్సన్, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ చేతుల మీదుగా కృష్ణాజిల్లా సహకారం కేంద్ర కార్యాలయంలో బుధవారం ఈ సన్మాన కార్యక్రమం జరిగింది. పెదమద్దాలి సంఘ సీఈఓ తోలేటి రవి సత్యప్రసాద్, జమీగొల్వేపల్లి సీఈఓ సూరపనేని శ్రీలక్ష్మిలను జేసీ సన్మానించారు. కార్యక్రమంలో పామర్రు కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ బొర్రా వెంకటేశ్వరరావు, సూపర్‌వైజర్ డీవీవీ పరుశురామయ్య తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారిణి బ్లెస్సీ నేహకు అభినందన



బ్లెస్సీ నేహాను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామోజీరావు, ఏఓ

గన్నవరంరూరల్: విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించటం ఎంతో గొప్ప విషయమని చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు అన్నారు. కళాశాల రెండో సంవత్సరం బీడీఎస్ విద్యార్థిని పి.బ్లెస్సీ నేహకు బుధవారం అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ నెల 17, 18వ తేదీల్లో విజయనగరంలో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో(మార్షల్ ఆర్ట్స్) చాంపియన్ షిప్ 2024 పోటీల్లో బ్లెస్సీ నేహ పాల్గొని బంగారు పతకం సాధించిందన్నారు. ఆమె స్ఫూర్తితో మిగిలిన విద్యార్థులు కూడా క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, దేహ దారుఢ్యానికి ఉపయోగపడతాయన్నారు. క్రీడల వల్ల నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని తెలిపారు. హైదరాబాద్‌లో జరిగే జాతీయ చాంపియన్ పోటీలకు నేహ ఎంపిక కావటం కళాశాలకు గర్వకారణమన్నారు. మరిన్ని విజయాలు సాధించాలని ఏఓ వై.మధుసూదనరావు ఆకాంక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.కోటేశ్వరరావు, డాక్టర్ నాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కోచ్ అంకమ్మరావును సత్కరించారు.

పొలంబడిపై రైతులకు శిక్షణ



రైతులకు సూచనలు ఇస్తున్న జిల్లా వ్యవసాయాధికారి హబీబ్‌బాషా, ఏడీఏ

మండవల్లి: జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌కే హబీబ్ బాషా రైతులకు పలు సూచనలు చేశారు. మండలంలోని లింగాల, పెరికెగూడెం, కొర్లపాడు గ్రామాల్లోని పొలాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉత్తమ యాజమాన్య పద్ధతులు, పొలంబడి మీద రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ద్రవ జీవామృతం తయారీ విధానం, ఉపయోగాలను రైతులకు వివరించారు. వరుసలలో నాటిన వరి పొలంలో కోనోవీడర్‌తో కలుపు తీయుట సులభమని రైతులకు వివరించారు. ఈ పంట నమోదు వలన పంట నష్టం ఉపయోగాలను వివరించారు. ధాన్యం కొనుగోలు చేసుకునేందుకు ఈ పంట నమోదు తప్పనిసరన్నారు. మండవల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు జి.వెంకటమణి పొలంబడి ప్రాముఖ్యతను వివరించారు. మండల వ్యవసాయాధికారి ఎస్‌కే జరీనా, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, మాస్టర్ ట్రెయినీలు సుబ్బరాజు, నాగవిజయ, వీఏఏలు, వర్మ, గోపాల్, దినేష్, ఆకాంక్ష, సంధ్య, సుభాని పాల్గొన్నారు.

తాగునీరు సరఫరా చేయాలి



వింజరం లాకుల వద్ద రైతులతో చర్చిస్తున్న ఇరిగేషన్ ఎస్ఈ గంగయ్య

కైకలూరు: శివారు గ్రామాలకు సాగు, తాగునీటిని సరఫరా చేయాలని పలువురు రైతులు ఇరిగేషన్ ఎస్ఈ గంగయ్యను కోరారు. కైకలూరు మండలం వింజరం లాకుల వద్ద రైతులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పలువురు రైతులు మాట్లాడుతూ ఇటీవల 50 శాతం తక్కువతో కాలువల మరమ్మతులకు టెండర్లను వేశారన్నారు. వారితో పనులు చేయించాలని కోరారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ బాబు, కైకలూరు, కలిదిండి మండల టీడీపీ అధ్యక్షుడు పెన్మత్స త్రినాథరాజు, పోకల జోగిరాజు, మండలాల ఈఈలు రాజగోపాల్, సిద్ధార్థ్, కిషోర్, రైతులు ప్రసాదరాజు, వాసురాజు, పెద్దిరాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ పోస్టర్ విడుదల



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కామినేని

కైకలూరు: రోడ్డుపై గేదెల సంచారం వలన జరిగే ప్రమాదాలను అరికట్టేందుకు రేడియం పోస్టర్లను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ట్రావెలర్స్ బంగ్లాలో బుధవారం ఆవిష్కరించారు. రహదారిపై గేదెల సంచారం వలన రోడ్డు ప్రమాదాలు ఇటీవల ఎక్కువయ్యాయి. ప్రధానంగా కైకలూరు నుంచి ఏలూరు వెళ్లే రహదారిలో కొవ్వాడలంక నుంచి పెద ఎడ్లగాడి వంతెన వరకు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. దీంతో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నాయకులు గుర్రం శ్యామ్‌కుమార్ తనయుడు సాగర్ రూ.30,000తో రేడియం కలర్స్‌తో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమంలో సీఐ బి.కృష్ణకుమార్, గుర్రం శ్యామ్‌కుమార్, కూటమీ నేతలు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌లో సమస్యలు..

ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ట్రావెలర్స్ బంగ్లాలో ప్రజాదర్బార్‌ను బుధవారం నిర్వహించారు. నియోజకవర్గంలో గ్రామాల నుంచి పలువురు వివిధ సమస్యలను వివరించారు. కార్యక్రమంలో కూటమి నేతలు పెన్మత్స త్రినాథరాజు, నర్సిపల్లి అప్పారావు, పూలా రాజీ, బలే ఏసురాజు పాల్గొన్నారు.

జెడ్పీ పాఠశాలలో బేస్‌లైన్ పరీక్షలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీబీఎస్ఈ సిలబస్‌పై పదో తరగతి విద్యార్థులకు బుధవారం బేస్‌లైన్ పరీక్షలు ప్రారంభించారు. నూతన విధానంలో నిర్వహించిన ఇంగ్లిష్ పరీక్షలో విద్యార్థులు అసౌకర్యానికి గురి కాకుండా నెట్ సౌకర్యం, టెక్నికల్ సపోర్టు ఇచ్చారు. ఈ పరీక్షలను అబ్జర్వర్ మురళీ కృష్ణారెడ్డి, జిల్లా నోడల్ ఆఫీసర్ షేక్ సైదా సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్, కో ఆర్డినేటర్ రమాదేవి మాట్లాడుతూ.. బేస్‌లైన్ పరీక్షలు ఈనెల 24వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. నూతన పద్ధతిలో పరీక్షలు నిర్వహించడంతో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా తగిన ఏర్పాట్లు చేశామన్నారు. అకడమిక్ కో ఆర్డినేటర్ శ్రీదేవి, టెక్నికల్ కో ఆర్డినేటర్లు విజయకుమార్, ఎల్.దుర్గాప్రసాద్, జీవన్, సీఆర్పీ భాగ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభల పర్యవేక్షణ అధికారుల నియామకం

కైకలూరు: గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామ సభలు ఈ నెల 23న మండలంలో అన్ని గ్రామాల్లో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎన్.ఉమామహేశ్వరరావు బుధవారం తెలిపారు. సచివాలయాల్లో నిర్వహించే గ్రామ సభలకు సంబంధించి ఇరిగేషన్ ఏఈ రాజగోపాల్ భుజబలపట్నం, పల్లెవాడ, వ్యవసాధికారి ఆర్.దివ్య తామరకొల్లు, వేమవరప్పాడు, డ్రెయినేజీ ఏఈఈ ఇందిరా ప్రియదర్శిని గోపవరం, రాచపట్నం, ఐసీడీఎస్ సీడీపీఓ దీప్తి ఆచవరం, వింజరం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బి.నాగబాబు పెంచికలమర్రు, పందిరపల్లిగూడెం, పీఆర్ ఏఈ సాధిక్‌పాషా దొడ్డిపట్ల, రామవరం, ఎఫ్‌డీఓ భవిత ఆటపాక, గోనెపాడు, మండల పశువైద్యులు నాగేంద్ర చటాకాయి, నత్తగుళ్లపాడు, హౌసింగ్ ఏఈ బీవీవీవీ.శేఖర్ కైకలూరు, ఎంఈఓ-2 వి.శ్రీనివాసరావు వరహాపట్నం, శీతనపల్లి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య వదర్లపాడు, సర్సాయిపాలెం, ఏపీఎం సత్యనారాయణ శృంగవరప్పాడు, గుమ్మళ్లపాడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షాహిదాఖానం ఆలపాడు, కొట్టాడ, ఏఎస్‌డబ్ల్యూఓ రత్నమ్మ శ్యామలాంబపురం పర్యవేక్షణ అధికారులుగా వ్యవహరిస్తారని ఎంపీడీఓ తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

రామవరప్పాడు: మద్యం దుకాణాల్లో పని చేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ వైన్స్ షాప్స్ కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో వైన్ షాప్స్ ఉద్యోగులు బుధవారం నిడమానూరులోని ఐఎంఎఫ్ఎల్ డిపో మేనేజర్ శ్రీనాథుడికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు ఉద్యోగ భద్రత, సరిగ్గా జీతాలు అందని పరిస్థితులను డిపో మేనేజర్‌కు వివరించామన్నారు. కూటమి ప్రభుత్వం అక్టోబర్ 1వ తేదీ నుంచి నూతన మద్యం పాలసీ తీసుకువస్తామని ప్రకటించడంతో బేవరేజ్ సంస్థలో పని చేస్తున్న వేలాది మంది ఉద్యోగాలు కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు.

రహదారికి మరమ్మతులు



కపిలేశ్వరపురం వద్ద రహదారికి మరమ్మతులు చేస్తున్న దృశ్యం

పమిడిముక్కల: మంటాడ-లంకపల్లి ప్రధాన రహదారిపై కపిలేశ్వరపురం గ్రామం పరిధిలో వాటర్ ట్యాంక్ నుంచి హైస్కూల్ వరకు రహదారి అధ్వానంగా మారింది. గ్రామం పరిధిలోని మిగిలిన రహదారంతా సీసీ రోడ్డుగా అభివృద్ధి చేసి ఈ ప్రాంతాన్ని వదిలేశారు. దీంతో ఈ రోడ్డంతా గుంతలు పడి అగాధంలా మారింది. వర్షం వస్తే గుంతలో నీరు చేరి రోడ్డు కనబడని పరిస్థితి నెలకొంది. దీనిపై సాక్షిలో ఇటీవల ప్రమాదకరంగా రహదారులు వార్త ప్రచురితమైంది. గ్రామస్తులు సమస్యను ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఆర్‌అండ్‌బీ అధికారులు రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఎమ్మెల్యే రహదారి పనులను పరిశీలించారు. మిగిలిన భాగం కూడా సీసీ రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆర్‌అండ్‌బీ ఏఈకు సూచించారు. గుంతలు పూడ్చి రోడ్డును చదును చేసి వెట్ మిక్స్ వేసినట్లు ఏఈ మల్లికార్జున తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

పాలంకిపాడు(మొవ్వ): మొవ్వ మండలం పాలంకిపాడు శివారులోని ఓ బహిరంగ ప్రదేశంలో పేకాట(కోతముక్క) ఆడుతున్నారంటూ వచ్చిన సమాచారం మేరకు కూచిపూడి పోలీసులు బుధవారం మెరుపు దాడి నిర్వహించారు. కూచిపూడి ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం తన సిబ్బందితో చేసిన దాడిలో ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.17,200ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.